

పర్యాటకుల భద్రతే లక్ష్యంగా..

మైపాడు బీచ్‌లో పర్యాటకుల భద్రత లక్ష్యంగా టూరిస్ట్ పోలీస్ పేరుతో అవుట్‌పోస్టులను ఏర్పాటు చేసింది.

8లో ▸



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రా)	రూ.57,890
22 క్యారెట్లు ఆర్నమెంట్ (1 గ్రా)	రూ.5,172
3 శాతం జీఎస్టీతో	రూ.5,326
నవర (8 గ్రా)	రూ.42,608

గరిష్ఠం/కనిష్ఠం
34.5 /22.6

వాతావరణం

జిల్లాలో ఉష్ణోగ్రతలు క్రమంగా పెరుగుతున్నాయి. గడిచిన రెండు రోజులుగా పగటి ఉష్ణోగ్రతలు పెరిగాయి. వాతావరణంలో తేమ 42 శాతం ఉంది.

న్యూస్‌రీల్

వేదగిరిపై విశేష పూజలు రేపు

నెల్లూరు రూరల్: రూరల్ పరిధిలోని నరసింహకొండపై కొలువై ఉన్న శ్రీవేదగిరి లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో మంగళవారం పౌర్ణమి పర్వదినం సందర్భంగా పలు విశేష అభిషేకాలు ప్రత్యేక పూజలు గిరిప్రదక్షిణ ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆదివారం ఆలయ చైర్మన్ సురేంద్రరెడ్డి ఈఓ గిరికృష్ణ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.

చిట్టి విజ్ఞాన కేంద్రం ఏర్పాటు



చిట్టి విజ్ఞాన కేంద్రాన్ని పరిశీలిస్తున్న జేడీ మువ్వా రామలింగం

నెల్లూరు (టౌన్): పొదలకూరులోని బాలురు ఉన్నత పాఠశాలలో సైన్స్ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న సుధాకర్ స్థానిక వేదాయపాళెంలోని తన నివాసంలో చిట్టి విజ్ఞాన కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఆదివారం ఈ విజ్ఞాన కేంద్రాన్ని పాఠశాల విద్యాశాఖ జాయింట్ డైరెక్టర్ మువ్వా రామలింగం ప్రారంభించారు. సుమారు రూ.10 లక్షల ఖర్చుతో వైజ్ఞానిక శాస్త్రంలోని అన్ని అంశాలకు సంబంధించి పరికరాలు, నమూనాలను ప్రదర్శించారు. ఈ సందర్భంగా జేడీ రామలింగం మాట్లాడుతూ చిన్నతనం నుంచే వైజ్ఞానిక భావాలను అర్థం చేసుకోగలిగితే భావి శాస్త్రవేత్తలుగా ఎదుగుతారని చెప్పారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డీఈఓ హరిప్రసాద్, కోవూరు ఎంఈఓ శ్రీహరి, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ లీలాప్రకాష్, ఏఎంఓ సుధీర్‌బాబు, ఎంఈఓ తిరుపాల్, వైద్యులు దయాకర్‌రావు, రాజేష్, వెంకటకృష్ణ, సైన్స్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

7 వరకు ఇంటర్‌సిటీ రద్దు

నెల్లూరు (సెంట్రల్): గూడూరు- విజయవాడ మధ్య నడిచే విక్రమ సింహపురి ఇంటర్ సిటీ రైలును ఈ నెల 7వ తేదీ వరకు రద్దు చేసినట్లు రైల్వే అధికారులు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నెల్లూరు–సూళ్లూరుపేట మధ్య మెమూ రైళ్లు కూడా ఈ నెల 12వ తేదీ వరకు రద్దు చేసినట్లు తెలిపారు. మనుబోలు సమీపంలో జరుగుతున్న మూడో ట్రాక్ పనుల దృష్ట్యా ఈ రైళ్లను తాత్కాలికంగా రద్దు చేసినట్లు రైల్వే అధికారులు తెలిపారు. ప్రయాణికులు గమనించాలని సూచించారు.


59.965 టీఎంసీల నిల్వ



సోమశిల: జలాశయంలో ఆదివారం సాయంత్రానికి 59.965 టీఎంసీలు ఉన్నాయి. జలాశయానికి 36 క్యూసెక్కుల ప్రవాహం వస్తోంది. పెన్నార్ డెల్టాకు 2,100, ఉత్తరకాలువకు 623, దక్షిణకాలువకు 400, కండలేరుకు 50 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. సగటున 335 క్యూసెక్కుల నీరు ఆవిరవుతోంది.

కార్మికుల జీతాల్లో కోతలు

నెల్లూరు పెద్దాస్పత్రిలో పారిశుధ్యం నిర్వహణకు టెండర్ ద్వారా కాంట్రాక్ట్ అప్పగించారు. అయితే సదరు కాంట్రాక్టర్ అవసరానికి మించి తనకు కావాల్సిన వారిని నియమించుకుని కనీస వేతనాలకు కోతలు పెడుతున్న పరిస్థితి నెలకొంది. నిబంధనల మేరకు వారంలో ఒక రోజు సెలవు ఉన్నప్పటికీ ఆ రోజుల్లో కూడా పనులు చేయిస్తున్నట్లు కార్మికులు వాపోతున్నారు. అత్యవసరమై, అనారోగ్యమై సెలవు పెడితే జీతం తగ్గిస్తున్నట్లు కార్మికులు ఆస్పత్రి సూపరింటెండెంట్‌కు ఫిర్యాదు చేయడం గమనార్హం.



- నెల్లూరు జీజీహెచ్ శానిటరీ కాంట్రాక్టర్ కక్కుర్తి
- నెలకు రూ.14 వేలు ఇవ్వాల్సి ఉంటే రూ.4 వేలే ఇస్తున్నారు
- పారిశుధ్య కార్మికుల ఆందోళన

సాక్షి ప్రతినిధి, నెల్లూరు: పెద్దాస్పత్రి పారిశుధ్య కాంట్రాక్టర్ కక్కుర్తి.. కార్మికులు శ్రమదోపిడీకి గురవుతున్నారు. ఆస్పత్రి ప్రాంగణంలోని డ్రైయినేజీ నుంచి మరుగుదొడ్లు శుభ్రపరిచడం, పరిసరాల్లో పారిశుధ్యాన్ని పరిరక్షించడంతో శానిటరీ సిబ్బంది కీలకంగా పనిచేస్తున్నారు. కరోనా సమయంలో ప్రాణాలను పణంగా పెట్టి పారిశుధ్యాన్ని కాపాడింది వీరే. ప్రతి నిత్యం జీజీహెచ్ శుభ్రంగా ఉందంటే వారి శ్రమే. అలాంటి పారిశుధ్య కార్మికుల నోట్లో మట్టి కొడుతున్నాడు. వారికి జీతాలిచ్చే కాంట్రాక్టర్ కోతలు విధించి దోపిడీకి పాల్పడుతున్నాడు. ప్రభుత్వ నిబంధనల మేరకు ఏ నెలలో ఏ ఒక్కరికీ పూర్తి జీతం ఇవ్వడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. జీతంలో సగం వరకు కోతలు విధిస్తున్నారంటూ కార్మికులు ఆందోళన చేస్తున్నారు. ప్రభుత్వ జీఓ ప్రకారం పెద్దాస్పత్రిలోని కార్మికులకు రూ.16 వేలు జీతం ఇవ్వాలి. ఇందులో పీఎఫ్, ఈఎస్‌ఐ వంటి సౌకర్యాల కల్పన కోసం కొంత నగదు కట్ చేస్తారు. చేతికి సుమారు రూ.14 వేలు వరకు జీతం రావాల్సి ఉంటుంది. సెలవులు పెడితే మరి కొంత కోత విధిస్తున్నారంటూ కార్మికులు



ఆస్పత్రి ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయడంతో ఈ వ్యవహారం బయటకు వచ్చింది.

200 మంది కార్మికులు

750 పడకల పెద్దాస్పత్రికి ప్రతి రోజు సుమారు 1,100 నుంచి 1,200 మంది వరకు రోగులు వస్తున్నారు. 450 మంది వరకు అడ్మిషన్‌లోనే ఉంటున్నారు. బహుళ అంతస్తుల భవనాలున్నాయి. ఈ భవనాలన్నింటిని శుభ్రం చేసేందుకు కాంట్రాక్ట్ పద్ధతిలో టెండర్ ద్వారా ఒక కాంట్రాక్టర్‌కు అప్పగించారు. పెద్దాస్పత్రిలో పారిశుధ్యాన్ని పర్యవేక్షించేందుకు 145 మంది కార్మికులే ఉండాలి. అయితే సదరు కాంట్రాక్టర్ కొందరి నుంచి ముడుపులు తీసుకుని 220 మంది వరకు కార్మికులను చేర్చుకున్నారు. ఆ తర్వాత కొంత మందిని తొలగించారు. ఇప్పుడు 200 మంది వరకు కార్మికులున్నారు. అయితే ప్రభుత్వం మాత్రం 145 మందికే జీతం ఇస్తోంది. ఈ జీతాల మొత్తాన్ని 200 మందికి సర్దుబాటు చేస్తూ శ్రమదోపిడీకి పాల్పడుతున్నాడు. ఫలితంగా కార్మికుల జీతాలకు కోత పడింది. ఇది చాలదన్నట్టు కొంత మందికి మరీ తగ్గించి నెలకు రూ.6 వేలు, రూ.4 వేలు జీతం తమ బ్యాంకు ఖాతాల్లో వేస్తున్నారంటూ కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం సకాలంలో జీతాలు విడుదల చేసినా.. చేయకపోయినా అగ్రిమెంట్ ప్రకారం కాంట్రాక్టర్ నెలనెలా జీతాలు ఇవ్వాలి. అయితే ప్రభుత్వం బడ్జెట్ విడుదల చేయలేదంటూ రెండు నెలలకో, మూడు నెలలకో జీతాలు ఇస్తున్నాడు. ఎప్పుడు చూసినా రెండు, మూడు నెలల జీ తాలు పెండింగ్‌లో ఉన్నట్లు కార్మికులు చెబుతున్నారు.

జీతాల కోసం ఆందోళన

నెలంతా కష్టపడినా నాలుగైదు వేలు కూడా చేతికి రావడం లేదని ఇది అన్యాయమంటూ పారిశుధ్య కార్మికులు ఆందోళన బాట పట్టారు. సూపరింటెండెంట్ డాక్టర్ సిద్ధానాయక్‌కు, ఆర్‌ఎంఓ డాక్టర్ కళారాణికి, హెచ్‌డీఎస్ కో-ఆర్డినేటర్ లక్ష్మీసునందకు ఫిర్యాదు చేశారు. ఆస్పత్రి వద్ద కార్మికులు నిరసనకు దిగి జీతాల్లో కోతలు లేకుండా సకాలంలో ఇవ్వాలని పారిశుధ్య కార్మికులు డిమాండ్ చేస్తున్నారు.

బయోమెట్రిక్ వేయకపోవడం వల్లనే సమస్య



పారిశుధ్య కార్మికులు విధులకు వస్తున్నారు. రికార్డుల్లో హాజరు ఉంది. అయితే బయోమెట్రిక్ హాజరు ఉండడం లేదు. అవగాహన లేక బయోమెట్రిక్ సక్రమంగా వేయకపోవడం వల్లనే వారికి హాజరు తగ్గింది. జీతాలు తగ్గిన వారికి రెండు, మూడు రోజుల్లో మిగతా బ్యాలెన్సు మొత్తాన్ని కార్మికుల ఖాతాల్లో వేయిస్తాం. సదరు కాంట్రాక్టర్‌ను హెచ్చరించాం. నిబంధనలు పాటించకపోతే చర్యలు తీసుకుంటాం.

– డాక్టర్ సిద్ధానాయక్, సూపరింటెండెంట్

ఇంటర్ ప్రాక్టికల్స్‌కు 125 మంది గైర్హాజరు

నెల్లూరు (టౌన్): ఇంటర్ ప్రాక్టికల్స్ పరీక్షలకు జిల్లా వ్యాప్తంగా మొత్తం 125 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. ఆదివారం ఉదయం జనరల్‌కు సంబంధించి 2,578 మందికి 2,550 మంది హాజరు కాగా, 28 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. ఒకేషనల్‌కు సంబంధించి 267 మందికి 242 మంది హాజరైతే 25 మంది గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం నుంచి జరిగిన ప్రాక్టికల్స్‌కు జనరల్ 2,252 మందికి 2,221 మంది హాజరైతే 41 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. ఒకేషనల్‌కు సంబంధించి 303 మందికి 272 మంది హాజరు కాగా 31 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు.

జగనన్నతోనే చేనేతలకు ఆర్థిక భరోసా



వెంకటగిరి: చేనేత కార్మికులను గతంలో ఏ ప్రభుత్వం ఆదుకోని విధంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైఎస్సార్ నేతన్న నేస్తం పథకం ద్వారా ఆర్థిక భరోసా కల్పిస్తున్నారని రాష్ట్ర పద్మశాలి కార్పొరేషన్ చైర్ పర్సన్ జింకా విజయలక్ష్మి తెలిపారు. పట్టణంలోని చేనేత కార్మికులను ఆదివారం ఆమె కలిసి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆమె మాట్లాడుతూ చేనేత పరిశ్రమకు పూర్వ వైభవం తీసుకొచ్చేలా చేపట్టాల్సిన చర్యలను కార్మికులను అడిగి తెలుసుకుని సీఎం దృష్టికి తీసుకెళ్లనున్నట్లు చెప్పారు. రాష్ట్ర పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్ నక్కా వెంకటేశ్వరరావు, కౌన్సిలర్ ఎం జానకిరామయ్య పాల్గొన్నారు.

'రెడ్‌క్రాస్' ఎన్నికల షెడ్యూల్ విడుదల

- వచ్చే నెల 2న పోలింగ్

నెల్లూరు(అర్బన్): ఇండియన్ రెడ్‌క్రాస్ జిల్లా కమిటీ ఎన్నికల షెడ్యూల్‌ను రెడ్‌క్రాస్ ప్రత్యేక అధికారి, డీఆర్వో వెంకటనారాయణమ్మ ఆదివారం ప్రకటించారు. ఒక నెల క్రితమే రెడ్‌క్రాస్ పాలక మండలి కమిటీ పదవీ కాలం పూర్తయింది. ఇప్పటి వరకు రెడ్‌క్రాస్ జిల్లా కమిటీ చైర్మన్‌గా ఉన్న పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి ఎమ్మెల్సీ ఎన్నికల బరిలో ఉండడం, అనివార్య కారణాల వల్ల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించలేకపోయారు. దీంతో రెడ్‌క్రాస్ అధ్యక్షుడిగా ఉన్న కలెక్టర్ చక్రధర్ బాబు తాత్కాలికంగా డీఆర్వో వెంకటనారాయణమ్మను ప్రత్యేకాధికారిగా నియమించారు. దీంతో కొద్ది రోజులుగా బాధ్యతలు చూస్తున్న ఆమె కలెక్టర్‌తో చర్చించి ఎన్నికల ప్రక్రియ చేపట్టారు. రెడ్‌క్రాస్ చైర్మన్‌తో సహా 15 మంది కమిటీ సభ్యులను ఎన్నుకోవాల్సి ఉంటుంది. ఎన్నికల అధికారిగా డీసీఓ తిరుపాల్‌రెడ్డి పర్యవేక్షిస్తారు. ఈ నెల 6న అర్హత ఉన్న ఓటర్ల వివరాలను రెడ్‌క్రాస్ సెక్రటరీ ప్రకటిస్తారు. ఓటర్ల జాబితాపై ఈ నెల 12 వరకు అభ్యంతరాలు స్వీకరిస్తారు. 15న ఫైనల్ ఓటర్ల జాబితాను విడుదల చేస్తారు. 18న ఎన్నికల నోటిఫికేషన్‌ను ఎన్నికల అధికారి ప్రకటిస్తారు. 26న కస్తూర్బా కళాక్షేత్రంలో నామినేషన్లు స్వీకరిస్తారు. అదే రోజు నామినేషన్ల పరిశీలన ప్రక్రియ, పోటీ చేస్తున్న అభ్యర్థుల ఉపసంహరణ ప్రక్రియ జరుగుతోంది. అనంతరం సర్వసభ్య సమావేశం జరగనుంది. పోటీలో ఉన్న అభ్యర్థులకు వచ్చే నెల (ఏప్రిల్) 2న పోలింగ్ నిర్వహిస్తారు. 3న కౌంటింగ్ నిర్వహిస్తారు. గెలుపొందిన అభ్యర్థులను ప్రకటిస్తారు. 4న రెడ్‌క్రాస్ జిల్లా కమిటీకి చైర్మన్, వైస్ చైర్మన్‌ను, కోశాధికారిని ఎన్నుకోవడంతో ఎన్నికల ప్రక్రియ ముగుస్తుంది.

7,704 మంది ఓటర్లు

రెడ్‌క్రాస్‌లో జీవిత సభ్యులు, సాధారణ సభ్యులకు ఓటింగ్ హక్కు ఉంటుంది. ఓటున్న వారు 7,704 మంది ఉన్నారు. ఇందుకు సంబంధించి జిల్లాలోని 11 బ్రాంచ్‌ల వారీగా పరిశీలించినప్పుడు నెల్లూరు రెడ్‌క్రాస్ బ్రాంచ్‌లో 4,780 మంది ఓటర్లు, కావలి బ్రాంచ్‌లో 2,280 మంది, ఆత్మకూరులో 151, కలువాయిలో 143, కందుకూరులో 70, విడవలూరులో 67, చేజర్లలో 57, వింజమూరులో 52, మర్రిపాడులో 49, కొడవలూరులో 22, ఉదయగిరిలో 21, దుత్తలూరులో 12 మంది ఓటర్లున్నారు.

ప్రతిష్ఠాత్మకంగా ఎన్నికలు

రెడ్‌క్రాస్ ఎన్నికలను అధికారులు ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించనున్నారు. గతంలో రెడ్‌క్రాస్ ఎన్నికలు సాధారణ ఎన్నికలను తలపించాయి. అభ్యర్థులు తమ గెలుపు కోసం ప్రతిష్ఠాత్మకంగా పని చేశారు. ఈ దఫా సైతం అదే రీతిలో ఎన్నికలు జరుగుతాయని రెడ్‌క్రాస్ సభ్యులు పేర్కొంటున్నారు.

తోడేరు చరిత్రలోనే విషాదకర ఘటన

- బాధిత కుటుంబాలకు రూ.5 లక్షల వంతున ఎక్స్‌గ్రేషియా చెక్కులు అందజేత
- ఆ కుటుంబాలను అన్ని విధాలా ఆదుకుంటాం
- రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి



మృతుల కుటుంబాలకు చెక్కులను అందజేస్తున్న మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

పొదలకూరు: తోడేరు చరిత్రలోనే అత్యంత విషాదకర ఘటన పడవ ప్రమాదమని, ఆరుగురు బిడ్డలను కోల్పోయిన కుటుంబాలకు తీరని బాధ మిగిలిందని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రకటించిన ఒక్కొక్క కుటుంబానికి రూ.5 లక్షల పరిహారం చెక్కులను మంత్రి ఆదివారం బాధిత ఇళ్ల వద్దకు వెళ్లి అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ మృతుల కుటుంబాలను అన్ని విధాలుగా ఆదుకుంటామన్నారు. చేతికి అందివచ్చిన కుమారులు అర్ధాంతరంగా మృతి చెందడం ఆ కుటుంబాలకు తీరని వేదనను మిగిల్చినట్లు పేర్కొన్నారు. మృతి చెందిన వారి పిల్లలను తీసుకురాలేకపోయినా ఆ కుటుంబాలకు తాను అండగా ఉంటానన్నారు. ఆరుగురు కుటుంబాల్లో ఒక్కొక్కరే మగ బిడ్డలు ఉండడం వల్ల వారి కన్నీటిని తుడిచే పరిస్థితి లేదన్నారు. దాదాపుగా అందరి కుటుంబాలు దిగువ మధ్య తరగతి కుటుంబాలేనన్నారు. తన స్వగ్రామం తోడేరులో దుర్ఘటన జరిగినట్లు వెంటనే సీఎం దృష్టికి తాను తీసుకు వెళ్లానన్నారు. స్పందించిన సీఎం పెద్దమనస్సుతో కుటుంబాలకు సంతాపం వ్యక్తం చేస్తూ ఎక్స్‌గ్రేషియా ప్రకటించిన విషయాన్ని మంత్రి గుర్తు చేశారు. ఆరుగురు మృతుల్లో కల్యాణ్‌కు వివాహం జరగడంతో వైఎస్సార్ బీమా కింద మరో రూ.5 లక్షల పరిహారం అందుతుందన్నారు. మిగిలిన వారు విద్యార్థులు, పనులు చేసుకునే అవివాహితులు కావడంతో బీమా సౌకర్యం వర్తించలేదన్నారు.

బోరున విలపించిన కుటుంబాలు

మంత్రి కాకాణి పరిహారం చెక్కులను బాధిత కుటుంబాలకు అందించేందుకు వారి ఇళ్లకు చేరుకోవడంతో ఆయా కుటుంబాల వారు మంత్రి రాకను చూసి బోరున విలపించారు. బట్ట రఘు తల్లి భావమ్మ ఒంటరిగా ఉండి విలపిస్తోంది భర్త మరణించడంతో ఒక్కగానొక్క కుమారుడిని చూసుకుని బతుకుతోంది. పడవ ప్రమాదంలో కుమారుడు మరణించడంతో కన్నీరుమున్నీరుగా విలపిస్తోంది. మంత్రి వెళ్లిన వెంటనే ఆయన్ను పట్టుకుని తనకు దిక్కెవరని పెద్ద పెట్టున రోదించింది. దీంతో మంత్రి భావోద్వేగానికి గురైన ఆయన ఆమెను ఓదార్చారు. అధైర్యపడొద్దని నేనున్నానని చెప్పారు. మంత్రి వెంట ఎంపీపీ సుబ్బరాయుడు, వైస్ ఎంపీపీ వేణుంబాక చంద్రశేఖర్‌రెడ్డి, సొసైటీ చైర్మన్ గోగిరెడ్డి గోపాల్‌రెడ్డి, మండల సచివాలయ కన్వీనర్ బచ్చల సురేష్‌కుమార్‌రెడ్డి, తోడేరు ఎంపీటీసీ సుగుణ, సర్పంచ్ పెంచలమ్మ, గ్రామస్తులు ఉన్నారు.

కేసు కంచికేనా!

ప్రభుత్వ వ్యవస్థలకు సంబంధించి నకిలీ డాక్యుమెంట్లు సృష్టించడం తీవ్రమైన నేరం. ఈ వ్యవహారాన్ని పోలీసులు సీరియస్‌గా తీసుకుంటున్నట్లు అనిపించడం లేదు. దర్యాప్తులో ముందడుగు పడుతున్నట్లు కనిపించడం లేదు. ఇందులో ఒకరిద్దరు కాదు.. పెద్ద ముఠానే ఉన్నట్లు ప్రాథమిక సమాచారం. డూప్లికేటుగాళ్లకు రెవెన్యూ, రిజిస్ట్రేషన్ శాఖలోని కొందరి సహకారం కూడా ఉన్నట్లు విశ్వసనీయ సమాచారం. తీగ లాగితే డొంకంతా బయటపడే అవకాశాలు ఉన్నాయి. కానీ పోలీసులు సాదాసీదా కేసుగా మార్చేసి, బాధితుడు, నిందితుల మధ్య రాజీ కుదిర్చి మూసివేసేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని తెలుస్తోంది.

- తీగ దొరికినా.. దర్యాప్తులో మీనమేషాలు
- డూప్లికేటుగాళ్ల కేసు వెనుక పెద్ద ముఠా?
- పోలీసుల దాటవేత ధోరణిపై పలు అనుమానాలు
- స్పందించని రెవెన్యూ, రిజిస్ట్రేషన్ శాఖలు

కావలి: ప్రభుత్వ భూమికి నకిలీ పట్టా సృష్టించి, వీఆర్వో, తహసీల్దార్, ఆర్డీఓ, సబ్ రిజిస్ట్రార్ సంతకాలు ఫోర్జరీ చేసి పక్కాగా వన్-బీ, పట్టాదారు పాస్ పుస్తకాలు తయారు చేసిన రూ.14 లక్షలు కొట్టేసిన డూప్లికేటుగాళ్ల కేసును కావలి రూరల్ పోలీసులు నీరుగార్చేస్తున్నట్లు కనిపిస్తోంది. కావలి మండలం రుద్రకోట వద్ద చెన్నై–కోల్‌కతా జాతీయ రహదారిని అనుకుని ఉన్న సర్వే నంబర్ 515/1లో 2.30 ఎకరాలు ప్రభుత్వ భూమి నకిలీ డాక్యుమెంట్లు సృష్టించిన విషయం తెలిసిందే. వీటి ద్వారా మండలంలోని తుమ్మలపెంట పంచాయతీ రామాంజనేయపురం గ్రామానికి చెందిన వాయిల రమణయ్యను అదే పంచాయతీ రెడ్డిపాళెం గ్రామానికి చెందిన పుల్లా కొండారెడ్డి, కావలి మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన కామినేని ఉదయలక్ష్మి, అన్నగారిపాళెం పంచాయతీ వీఆర్వో వట్టికాళ్ల మాల్యాద్రి కలిసి మోసం చేసి రూ.14 లక్షలు కాజేసిన విషయం విదితమే. ఈ వ్యవహారంపై బాధితుడి ఫిర్యాదు మేరకు రంగంలోకి దిగిన పోలీసులు నిందితులను గుర్తించి అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. కలిగిరి మండలం తూర్పుగుడ్లదొన గ్రామానికి చెందిన చిట్టే కొండయ్య వీఆర్వో, తహసీల్దార్, ఆర్డీఓ, సబ్ రిజిస్ట్రార్ సంతకాలు ఫోర్జరీ చేయడంతో పాటు రెవెన్యూ, రిజిస్ట్రేషన్‌శాఖ రబ్బర్ స్టాంపులతో పక్కాగా నకిలీ పట్టా, వన్-బీ, పట్టాదారు పాస్ పుస్తకాలు, సాగుబడి అడంగళ్ తయారు చేసినట్లు నిర్ధారించారు. అయితే చీటింగ్, ఫోర్జరీ కేసులో వీఆర్వో వట్టికాళ్ల మాల్యాద్రి ఉన్నారని మాత్రం పోలీసులు తహసీల్దార్‌కు లిఖిత పూర్వకంగా సమాచారం ఇచ్చారు. సదరు వీఆర్వో కోర్టు కేసుల వ్యవహారంలో రెవెన్యూ ఉన్నతాధికారులకు అసిస్టెంట్‌గా వ్యవహరిస్తున్నాడు. ఇదే విషయాన్ని తెలియజేస్తూ కావలి తహసీల్దార్ రెవెన్యూ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినట్లు తెలిసింది.

తీవ్రమైన నేరమని తెలిసినా..

రెవెన్యూ రిజిస్ట్రేషన్ శాఖ అధికారుల సంతకాలను ఫోర్జరీ చేయడం, నకిలీ డాక్యుమెంట్లు సృష్టించడం పెద్ద నేరమని, నాన్‌బెయిలబుల్ కేసు అని న్యాయ నిపుణులు చెబుతున్నారు. అయితే పోలీసుల దీన్ని సాదాసీదా కేసుగా కొట్టిపారేస్తున్నట్లు కనిపిస్తోంది. నిందితులకు రెవెన్యూ డాక్యుమెంట్లు ఎక్కడి నుంచి వచ్చాయి.. రబ్బర్ స్టాంప్‌లు ఎవరు చేసి ఇస్తున్నారనే విషయాలను సైతం పోలీసులు గాలికి వదిలేసినట్లు తెలుస్తోంది. ఈ కేసులో నిందితులను నేరుగా అరెస్ట్ చేయలేమని, బెయిలబుల్ కేసు కాబట్టి నిందితులను 41సీ నోటీసు ఇచ్చి పిలిపించి విచారించే కేసు అంటూ చట్టంలోని లొసుగులను అడ్డం పెట్టుకుని నేర తీవ్రతను నీరుగార్చేస్తున్నారనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ వ్యవహారంలో బాధితుడికి రూ.14 లక్షలు తిరిగి ఇచ్చేందుకు మరో కీలక నిందితుడు పుల్లా కొండారెడ్డితో ప్రైవేట్ మధ్యస్తం జరిగినట్లు తెలుస్తోంది. సాధారణ కేసుగా నమోదు చేసి, లోక్‌అదాలత్ ద్వారా రాజీ చేసుకునే విధంగా పోలీసులు 'రాజీ'కీయం చేసినట్లు విశ్వసనీయ సమాచారం.

తీగ దొరికినా..

ఏ కేసులో అయినా పోలీసులు తీగ దొరికితే డొంకంతా కదిలిస్తారు. కానీ ఈ కేసులో పోలీసులు తీగ దొరికినా.. వదిలేసి ఇంకెవరైనా ఫిర్యాదు చేస్తే దర్యాప్తు చేస్తామని, ప్రస్తుతానికి చట్టపరంగానే ముందుకు వెళ్తున్నామని పోలీసులు చెబుతున్న తీరును చూస్తే పెద్ద ఎత్తున ముడుపులు చేతులు మారినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. నకిలీ డాక్యుమెంట్లు, రబ్బర్ స్టాంప్‌లు తయారు చేయడం పెద్ద నేరం. బయటపడిన ఈ కేసు కాకుండా గతంలో ఇలాంటి మోసాలకు ఏమైనా పాల్పడ్డారా? నకిలీ డాక్యుమెంట్లు, రబ్బర్ స్టాంప్‌లు తయారు చేసి ఇచ్చేది ఎవరనేది కూపీలాగే పెద్ద ముఠా బయటపడే అవకాశాలు ఉన్నా.. ఆ దిశగా దర్యాప్తు చేయడంలో మీనమేషాలు వేస్తున్నారనే ఆరోపణలు లేకపోలేదు.

రెవెన్యూ, రిజిస్ట్రేషన్ శాఖ స్పందిస్తాయా?

ప్రభుత్వ భూమికి నకిలీ పట్టా సృష్టించి, వీఆర్వో, తహసీల్దార్, ఆర్డీఓ, సబ్ రిజిస్ట్రార్ సంతకాలు ఫోర్జరీ చేసి పక్కాగా వన్-బీ, పట్టాదారు పాస్ పుస్తకాలు తయారు చేయడంపై ఆయా శాఖల అధికారులు స్పందిస్తారా? లేక వదిలేస్తారా అనేది తెలియాల్సి ఉంది.



ఫిర్యాదులు ఇస్తే విచారణ చేస్తాం

ప్రభుత్వ నకిలీ డాక్యుమెంట్లు తయారు చేసి మోసం చేసిన కేసులో నిందితులపై చట్ట పరమైన చర్యలు తీసుకుంటున్నాం. నిందితులు గతంలో ఇంకేమైనా ఇలాంటి మోసాలకు పాల్పడినట్లుగా బాధిత వ్యక్తులు, ఇతర ప్రభుత్వ శాఖలు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు ఇస్తే వాటిపై విచారణ చేస్తాం.

– మునిపల్లి రాజేష్, సీఐ, కావలి రూరల్ సర్కిల్

98.83 శాతం పింఛన్ల పంపిణీ



బీవీనగర్‌లో దివ్యాంగుడు బాలసుబ్రహ్మణ్యంకు నగదు అందజేస్తున్న వలంటీరు కీర్తి



చేజర్లలో పెంచల లక్ష్మమ్మకు కానుక నగదు అందజేస్తున్న వలంటీరు హరిత

నెల్లూరు (పొగతోట): వైఎస్సార్ పింఛన్ కానుక పంపిణీ ప్రక్రియ జిల్లాలో పూర్తి అయింది. ఆదివారం చివరి రోజుకు 98.83 శాతం మంది లబ్ధిదారులకు కానుక పంపిణీ చేశారు. 3,08,953 మంది లబ్ధిదారులకు నగదు పంపిణీ చేయాల్సి ఉండగా వలంటీర్లు గత ఐదు రోజుల నుంచి శ్రమించి 3,05,349 మందికి అందజేశారు.

ప్రజల మన్ననలు పొందుతున్న మోదీ పాలన

- కేంద్ర మంత్రి ఎల్.మురగన్



మాట్లాడుతున్న కేంద్రమంత్రి ఎల్.మురగన్

నెల్లూరు (బారకాసు): దేశ ప్రజలందరి మన్ననలు పొందే విధంగా ప్రధాని నరేంద్రమోదీ పాలన సాగుతోందని కేంద్ర పశుసంవర్ధక మత్స్య శాఖ, సమాచార ప్రసార శాఖా మంత్రి ఎల్.మురగన్ అన్నారు. ఆదివారం ఆయన నగరంలోని వేదాయపాళెం సమీపంలో ఉన్న ఎమ్మెల్సీ వాకాటి నారాయణరెడ్డి నివాసంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మత్స్య, పశుసంవర్థకశాఖ రంగాల అభివృద్ధి కోసం ప్రధాని మోదీ ప్రభుత్వం అన్ని రకాలుగా సహాయ సహకారాలు అందిస్తోందన్నారు. పాడి పరిశ్రమలు, విద్యారంగానికి సంబంధించి కేంద్రం అనేక సంస్కరణలకు నాంది పలికిందన్నారు. త్వరలో జరగనున్న తూర్పు రాయలసీమ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులు సన్నారెడ్డి దయాకర్‌రెడ్డి, బ్రహ్మానందంను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం వేదాయపాళెంలోని పలు ప్రాంతాల్లో ఆయన పర్యటించి ప్రచారం నిర్వహించారు. ఎమ్మెల్సీ వాకాటి నారాయణరెడ్డి బీజేపీ పార్టీ నేతలు సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి, సురేంద్రరెడ్డి, కర్నాటి ఆంజనేయరెడ్డి, భరత్‌కుమార్‌యాదవ్, పార్టీ తరఫున ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థులు దయాకర్‌రెడ్డి, బ్రహ్మానందం పాల్గొన్నారు.

పర్యాటకుల భద్రతే లక్ష్యంగా..

సెలవు రోజుల్లో పుణ్యక్షేత్రాలు, పర్యాటక ప్రాంతాలకు ప్రజలు పెద్దఎత్తున వస్తుంటారు. వారికి ఎలాంటి ఇబ్బంది కలగకుండా.. రక్షణగా ఉండేందుకు 'పర్యాటక పోలీస్' అనే కార్యక్రమానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా ఏర్పాటు చేసిన కేంద్రాల్లో 24 గంటలపాటు సిబ్బంది అందుబాటులో ఉంటూ అసాంఘిక కార్యకలాపాలు, నేరాలను కట్టడి చేస్తారు.

- కొత్త కార్యక్రమానికి ప్రభుత్వం శ్రీకారం
- మైపాడు తీరంలో టూరిస్ట్ పోలీస్ కేంద్రం ఏర్పాటు



మైపాడు బీచ్‌లో పర్యాటకులు (ఫైల్)

ఇందుకూరుపేట: మండలంలోని మైపాడు బీచ్.. పర్వదినాలు, సెలవు రోజుల్లో ఇక్కడ సందర్శకుల తాకిడి అధికంగా ఉంటుంది. జిల్లాలోని ప్రాంతాల నుంచే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి ఎంతోమంది పర్యాటకులు వస్తుంటారు. చిన్నా.. పెద్ద తేడా లేకుండా కుటుంబాలతో సంతోషంగా గడుపుతుంటారు. ఈ నేపథ్యంలో ప్రజల భద్రతే లక్ష్యంగా ప్రభుత్వం టూరిస్ట్ పోలీస్ కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఈవ్‌టీజింగ్, దొంగతనాలు జరగకుండా చూడటంతోపాటు బీచ్‌లో ప్రమాదవశాత్తు ఎవరైనా నీటిలో మునిగిపోతే వారిని కాపాడేందుకు ఆయా కేంద్రాల్లో ఉండే పోలీసులు చర్యలు తీసుకుంటారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గత నెలలో వర్చువల్ విధానంలో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఏదైనా సమస్య ఎదురైనా బాధితులు కేంద్రంలో ఫిర్యాదు చేయొచ్చు. దేవదాయ శాఖను సమన్వయం చేసుకుంటూ సందర్శకులు, భక్తులు, ప్రజలకు మెరుగైన సేవలందిస్తారు.



మైపాడులో విధుల్లో ఉన్న పోలీస్ అధికారులు, సిబ్బంది (ఫైల్)

సేవలిలా..

- బీచ్ వద్ద 24 గంటలు పోలీసులు సేవలు అందుబాటులో ఉంచారు.
- పోలీస్ విధులు నిర్వర్తించేందుకు తీరంలో ఔట్‌పోస్ట్‌ను నిర్మించారు.
- ఇక్కడి నుంచి సమాచారాన్ని పోలీస్ శాఖలోని అధికారులకు అందించేలా సెట్ అందుబాటులో ఉంచారు.
- సముద్ర స్నానాలు చేసేందుకు వచ్చే సందర్శకులను నిత్యం హెచ్చరిస్తూ అప్రమత్తం చేస్తున్నారు.
- బీచ్‌కు వచ్చిన పర్యాటకులకు ఏవైనా సమస్యలు ఎదురైనా, వస్తువులు, నగదు చోరీకి గురైనా పోలీసులకు ఫిర్యాదు చేస్తే వెంటనే చర్యలు తీసుకుంటారు.



టూరిస్ట్ పోలీస్ కేంద్రం

- బాధితుల ఫిర్యాదులను అక్కడే రికార్డుల్లో నమోదు చేస్తారు.
- పదిమంది మత్స్యకార యువకులతో రెస్క్యూ టీం ఉంది.
- ఎవరైనా నీటిలో మునిగిపోతే వెంటనే ఆ టీం రంగంలోకి దిగి కాపాడుతుంది.
- వాహనాల రద్దీ అధికంగా ఉంటే ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటారు.

అప్రమత్తం చేస్తున్నారు



వీలు చిక్కినప్పుడల్లా మైపాడు బీచ్‌కు వచ్చి సేద తీరుతుంటాం. బీచ్ వద్ద టూరిస్ట్ పోలీస్‌లను అందుబాటులో ఉంచారు. ప్రమాదాల బారిన పడకుండా అప్రమత్తం చేస్తున్నారు.

– కేఎస్ బాబు, కోవూరు

భరోసా కల్పిస్తున్నారు



మైపాడు బీచ్‌లో పర్యాటక పోలీస్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఇది చాలా ఉపయోగకరంగా ఉంటుంది. పోలీసులు పర్యాటకులకు భరోసా కల్పిస్తున్నారు. ప్రమాదాలు బాగా తగ్గుతాయి.

– కె.కోదండపాణి, గూడూరు

సద్వినియోగం చేసుకోవాలి

ప్రభుత్వం కొత్తగా పర్యాటక పోలీస్ కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఎస్పీ విజయారావు ఆదేశాల మేరకు 24 గంటలు పోలీస్ సిబ్బంది అందుబాటులో ఉంటారు. పర్యాటకులకు శాఖాపరమైన సేవలు సకాలంలో అందేలా చర్యలు తీసుకున్నాం. ప్రమాదాల నుంచి కాపాడేందుకు స్థానిక యువకులతో రెస్క్యూ టీం ఏర్పాటు చేసి అందుబాటులో ఉంచాం. టూరిస్ట్ పోలీసుల సేవలను పర్యాటకులు సద్వినియోగం చేసుకోవాలి.

– కె.రామకృష్ణారెడ్డి, సీఐ, కోవూరు

క్లుప్తంగా

అదుపుతప్పి.. విద్యుత్ స్తంభాన్ని ఢీకొని..

- రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి
- దంపతులకు గాయాలు



జగదీష్ మృతదేహం



గాయపడిన వ్యక్తి

బుచ్చిరెడ్డిపాళెం: రోడ్డు ప్రమాదంలో ఎం.జగదీష్ (26) అనే యువకుడు మృతిచెందాడు. సుబ్రహ్మణ్యం, వాణి దంపతులు గాయపడ్డారు. ఈ ఘటన మండలంలోని జొన్నవాడ శివారులో ఆదివారం జరిగింది. స్థానికులు, పోలీస్‌ల కథనం మేరకు.. కోవూరు మండలం పోతిరెడ్డిపాళేనికి చెందిన జగదీష్, సుబ్రహ్మణ్యం స్నేహితులు. నెల్లూరు రూరల్ మండలంలోని కొండలపూడి సంఘం గ్రామంలో సుబ్రహ్మణ్యం బంధువుల ఇంట్లో ఆదివారం శుభకార్యం జరిగింది. ఇందులో పాల్గొనేందుకు సుబ్రహ్మణ్యం అతడి భార్య వాణి, జగదీష్ కలిసి మోటార్‌బైక్‌పై జొన్నవాడ మీదుగా కొండలపూడి సంఘం చేరుకున్నారు. అక్కడ కార్యక్రమం పూర్తికాగానే తిరిగి పోతిరెడ్డిపాళేనికి బయలుదేరారు. ఆ సమయంలో బైక్‌ను జగదీష్ నడుపుతున్నాడు. జొన్నవాడ దాటిన తర్వాత మలుపు వద్ద బైక్ అదుపుతప్పి విద్యుత్ స్తంభానికి ఢీకొంది. ఈ ప్రమాదంలో జగదీష్ ఎగిరి పడగా తలకు బలమై అక్కడికక్కడే మృతిచెందాడు. సుబ్రహ్మణ్యం స్వల్పంగా.. వాణి తీవ్రంగా గాయపడ్డారు. కాగా ఆమె ఆరో నెలల గర్భిణి. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని గాయపడిన భార్యాభర్తలను 108 అంబులెన్స్‌లో నెల్లూరు ప్రభుత్వ వైద్యశాలకు తీసుకెళ్లారు. అయితే వాణి పరిస్థితి కాస్త విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం 108లో తిరుపతి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. జగదీష్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. ఈ ప్రమాదంపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై వీరప్రతాప్ తెలిపారు.

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్ (లైవ్)	: 98
లేయర్ (లైవ్)	: 75
బ్రాయిలర్ చికెన్	: 180
బ్రాయిలర్ స్కిన్‌లెస్	: 200
లేయర్ చికెన్	: 128



నిమ్మ ధరలు (కిలో)

పెద్దవి	: రూ.80
సన్నవి	: రూ.74
పండ్లు	: రూ.40



ప్రేమ వివాహం.. విషాదాంతం

- వరకట్న వేధింపులతో వివాహిత ఆత్మహత్య
- భర్త, అత్తింటివారిపై కేసు నమోదు



మేఘన మృతదేహం

నెల్లూరు(క్రైమ్): వారిది ప్రేమ వివాహం.. ఎనిమిది నెలల పాప ఉంది. అయితే వరకట్నం వివాహిత పాలిట శాపంగా మారింది. భర్త, అత్తింటి వేధింపులు తాళలేక బలవన్మరణానికి పాల్పడింది. ఈ హృదయ విషాద ఘటన నెల్లూరులోని నక్కాగోపాల్‌నగర్‌లో ఆదివారం తెల్లవారుజామున జరిగింది. పోలీసుల కథనం మేరకు.. నెల్లూరు రూరల్ మండలం దొంతాలి గ్రామానికి చెందిన వి.హరిబాబు, దేవి దంపతులకు చందు, మేఘన (20) పిల్లలున్నారు. హరిబాబు 2007లో అనారోగ్యంతో మృతిచెందాడు. దేవి ఆశావర్కర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. మేఘన ఇంటర్మీడియట్ వరకు చదువుకుంది. ఆమె నక్కాగోపాల్‌నగర్‌కు చెందిన జిమ్ ట్రైనర్ ఏకొల్లు కుమార్ అలియాస్ దేవకుమార్ ప్రేమించుకున్నారు. 2021 మేలో వారు ఇంటి నుంచి పారిపోయి జొన్నవాడలో వివాహం చేసుకుని నక్కాగోపాల్‌నగర్‌లో కాపురం పెట్టారు. కొద్దిరోజులకే మేఘన తల్లి, కుటుంబసభ్యులు వారి వివాహాన్ని అంగీకరించారు. దీంతో ఇరు కుటుంబాలు అప్పుడప్పుడు కలుసుకునేవి.

నగదు, బంగారం ఇచ్చినా..

ఎనిమిది నెలల క్రితం మేఘన పాపకు జన్మనిచ్చింది. అప్పటి నుంచి భర్త, అత్త, ఆడబిడ్డ, మరిది ఆమెను అదనపు కట్నం తీసుకురావాలని హింసించసాగారు. మేఘన తన తల్లికి ఫోన్ చేసి ఈ విషయం చెప్పి చెప్పి కన్నీటి పర్యంతమైంది. దీంతో దేవి విడతలవారీగా రూ.30 వేల నగదు, సుమారు మూడుసవర్ల బంగారు వస్తువులను కుమార్‌కు ఇచ్చింది. అయినా అత్తింటి వారు మరింత నగదు, నగలు కావాలని మేఘనపై ఒత్తిడి తెచ్చారు. అనవసరంగా నిన్ను పెళ్లి చేసుకున్నానని, మరో యువతిని చేసుకుని ఉంటే ఎక్కువ కట్నం వచ్చేదంటూ భర్త ఆమెను సూటిపోటి మాటలతో బాధించసాగాడు. మేఘనను అత్తింటి వారు ఇంటి నుంచి గెంటేయగా దేవి, పెద్దమనుషులు నగదు త్వరలో ఇస్తామని చెప్పి భర్త ఇంటి వద్ద వదిలిపెట్టారు. ఎప్పటికైనా వారు మారకపోతారా అంటూ వారి చేష్టలను మేఘన మౌనంగా భరించింది. ఈనెల 4వ తేదీ రాత్రి మేఘన, కుమార్ మధ్య వరకట్న విషయమై గొడవపడ్డారు. కొద్దిసేపటి అనంతరం ఇద్దరూ నిద్రపోయారు.

వారే చంపేశారు

ఆదివారం ఉదయం కుమార్ తన భార్య బంధువు అన్నపూర్ణకు ఫోన్ చేసి మేఘన ఆత్మహత్య చేసుకుందని తెలిపాడు. ఆమెకు తనతో రాత్రి గొడవ జరిగిందని, ఆ తర్వాత నిద్రపోయిందని, తెల్లవారుజామున 3.30 గంటలకు మెలకువ వచ్చి చూడగా చీరతో ఉరేసుకుని వేలాడుతూ కనిపించిందని, వెంటనే తెలిసిన వారి సాయంతో కిందకు దించి చికిత్స నిమిత్తం జీజీహెచ్‌కు తీసుకెళ్లగా పరీక్షించిన వైద్యులు మృతిచెందినట్లు నిర్ధారించారని చెప్పాడు. అన్నపూర్ణ ద్వారా విషయం తెలుసుకున్న దేవి, కుటుంబసభ్యులు హాస్పిటల్‌కు చేరుకున్నారు. విగతజీవిగా పడి ఉన్న మేఘనను చూసి కన్నీటిపర్యంతమయ్యారు. తన కుమార్తెను కుమార్, అత్తింటివారు అదనపు కట్నం కోసం వేధిస్తున్నారని, వారే ఆమెను చంపి ఆత్మహత్యగా చిత్రీకరిస్తున్నారని బాధిత తల్లి వేదాయపాళెం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కుమార్తె ఒంటిపై అక్కడక్కడగా గాయాలున్నాయని ఆమె మరణానికి కారకులపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో పేర్కొంది. వేదాయపాళెం ఇన్‌స్పెక్టర్ కె.నరసింహారావు మృతురాలి భర్త, అతని కుటుంబసభ్యులపై సెక్షన్ 304బీ కింద కేసు నమోదు చేశారు. నగర డీఎస్పీ డి.శ్రీనివాసరెడ్డి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

టిప్పర్ ఢీకొన్న ప్రమాదంలో మరొకరి మృతి

- గాయపడిన యువకుడికి శాశ్వత వైకల్యం



మృతుడు ఇండ్ల ఓబులు

కావలి: గ్రావెల్ టిప్పర్ మరో వ్యక్తి ప్రాణాన్ని బలి తీసుకుంది. శనివారం రాత్రి గ్రావెల్ కోసం మితిమీరిన వేగంతో వెళ్తున్న టిప్పర్ మోటార్‌బైక్‌ను ఢీకొనడంతో బొగ్గవరపు బ్రహ్మయ్య (28) అనే దళిత వ్యక్తి ఘటనా స్థలంలోనే మరణించిన విషయం తెలిసిందే. నెల్లూరులో చికిత్స పొందుతూ ఇండ్ల ఓబులు (60) అనే గిరిజన వ్యక్తి ఆదివారం మరణించాడు. తీవ్రంగా గాయపడిన కొమరగిరి సాయి (20) అనే గిరిజన యువకుడికి ప్రాణాపాయం తప్పింది. అయితే కాలు విరిగిపోవడంతో శాశ్వత వైకల్యంతో జీవించాల్సి ఉంటుందని డాక్టర్లు చెబుతున్నారు. కొండాపురం మండలం సత్యవోలు పంచాయతీ రామానుజపురం గ్రామానికి చెందిన బ్రహ్మయ్య డిగ్రీ వరకు చదివాడు. టైల్స్ వేసే పనులు చేస్తూ కుటుంబసభ్యులకు అండగా ఉన్నాడు. అలాగే ఓబులు కూలి పనులకు వెళ్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. గ్రావెల్ టిప్పర్ వారిని కబళించడంతో రెండు కుటుంబాలు వీధిన పడ్డాయి.

- కావలి పట్టణ చుట్టుపక్కల గ్రామాల్లోని చెరువులు, గుంతలు, కాలువల నుంచి గ్రావెల్, మట్టి, ఇసుకను అక్రమంగా రవాణా చేస్తున్న వారి ధనదాహం వల్లే ఇద్దరు వ్యక్తులు మరణించారని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఘటనా స్థలం నుంచి మాయమైపోయిన టిప్పర్‌ను కావలి టుటౌన్ ఇన్‌చార్జి సీఐ కె.శ్రీనివాసరావు గుర్తించి స్వాధీనం చేసుకున్నారని, డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నట్లుగా తెలిసింది. ఈ కేసును దర్యాప్తు చేస్తున్నారు.

రైల్వే క్రికెట్ టోర్నమెంట్ విజేత సూళ్లూరుపేట

నాయుడుపేటటౌన్: దక్షిణ రైల్వే ఉద్యోగుల ఫ్రెండ్‌షిప్ క్రికెట్ టోర్నమెంట్‌లో సూళ్లూరుపేటకు చెందిన రైల్వే సోల్జర్స్ జట్టు విజేతగా నిలిచింది. శని, ఆదివారాల్లో స్థానిక ఏఎల్‌సీఎం మైదానంలో ఈ పోటీలు జరిగాయి. దక్షిణ రైల్వే డివిజన్ పరిధిలోని పోన్నేరి నుంచి గూడూరు రైల్వేస్టేషన్ల వరకు రైల్వే ఉద్యోగులు పది జట్లుగా ఏర్పడి ఫ్రెండ్‌షిప్ టోర్నమెంట్‌లో తలపడ్డారు. టోర్నమెంట్ చైర్మన్ సూళ్లూరుపేట రైల్వే ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ అలెగ్జాండర్ సారథ్యంలో పోటీలను నిర్వహించారు. విజేతలకు ప్రోత్సాహక నగదు, ట్రోఫీలను అలెగ్జాండర్‌తోపాటు దక్షిణ రైల్వే ఎస్‌ఎంఆర్‌లు రంజిత్ కుమార్, ఎస్‌ఎస్‌ఈ కె.కృష్ణమూర్తి, రిటైర్డ్ ఎస్‌ఎం కే రమణయ్య, కిరణ్‌కుమార్ అందించారు. క్రికెట్ పోటీలను తిలకించేందుకు వారి కుటుంబసభ్యులతోపాటు క్రీడాభిమానులు హాజరై సందడి చేశారు.

ప్రతిభ చాటిన నాయుడుపేట క్రీడాకారులు

నాయుుడుపేటటౌన్: తమిళనాడు రాష్ట్రంలోని పల్లవరంలో ఆదివారం జరిగిన ఓపెన్ మారథాన్ అథ్లెటిక్స్ పోటీల్లో నాయుడుపేట ఎస్‌ఎస్‌ఎఫ్ (నాయుడుపేట స్పోర్ట్స్ ఫెడరేషన్) క్రీడాకారులు ప్రతిభ చూపి పతకాలు సాధించినట్లు ఎస్‌ఎస్‌ఎఫ్ వ్యవస్థాపకుడు మోమిడి లక్ష్మయ్య తెలిపారు. రెండువేల మీటర్ల పరుగు పందెంలో ఎం.మహీధర్ ద్వితీయ స్థానంలో నిలిచినట్లు పేర్కొన్నారు. నాలుగువేల మీటర్ల పరుగుపందెంలో ఎస్.మోక్ష ద్వితీయ స్థానం, ఎస్.వరుణ్ సందేశ్ తృతీయస్థానంలో నిలిచినట్లు తెలిపారు. ఈనెల 8వ తేదీ అంతర్జాతీయ మహిళ దినోత్సవం సందర్భంగా ఈ పోటీలు జరిగాయన్నారు. విజేతలను స్థానిక ఎస్‌ఎస్‌ఎఫ్ అధ్యక్షుడు కలికి సుదీప్‌రెడ్డి, కాలగంధ శ్రీహరి అభినందించారు.

తండ్రిపై తనయుడి హత్యాయత్నం

నెల్లూరు(క్రైమ్): డబ్బు ఇవ్వలేదన్న అక్కసుతో నిద్రిస్తున్న తండ్రిపై తనయుడు హత్యాయత్నం చేసిన ఘటన నెల్లూరులోని వీఎంఆర్ నగర్‌లో ఆదివారం జరిగింది. పోలీసుల కథనం మేరకు.. మర్రిపాడు మండలం సన్నువారిపల్లికి చెందిన వెంకటేశ్వర్లు, నాగరత్నం దంపతులకు లావణ్య, బాలాజీ అనే పిల్లలున్నారు. వెంకటేశ్వర్లు కూలి పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఏడాదిన్నర క్రితం ఉపాధి నిమిత్తం ఆ కుటుంబం నెల్లూరుకు వచ్చింది. వీఎంఆర్ నగర్‌లో నివాసం ఉంటున్నారు. కొడుకు బాలాజీ నగరంలోని ఓ సిమెంట్ షాపులో పనికి వెళ్తున్నాడు. అతను వ్యసనాలకు బానిసయ్యాడు. మద్యం తాగేందుకు నగదు కోసం నిత్యం తండ్రితో గొడవపడి దొరికినంత తీసుకెళ్లేవాడు. శనివారం రాత్రి రూ.5 వేలు కావాలని బాలాజీ తండ్రిని అడగ్గా లేవని చెప్పాడు. దీంతో డబ్బు ఇవ్వకపోతే చంపుతానని బెదిరించాడు. ఈ నేపథ్యంలో ఆదివారం ఉదయం నిద్రిపోతున్న వెంకటేశ్వర్లుపై బాలాజీ బ్లేడ్‌తో దాడి చేశాడు. మెడపై కోయగా అతను కేకలు వేశాడు. స్థానికులు రావడాన్ని గమనించి బాలాజీ పరారయ్యాడు. బాధితుడిని స్థానికులు 108 అంబులెన్స్‌లో చికిత్స నిమిత్తం జీజీహెచ్‌కు తరలించారు. వెంకటేశ్వర్లు వేదాయపాళెం పోలీసులకు ఫిర్యాదు చేయగా బాలాజీపై హత్యాయత్నం కేసు నమోదు చేశారు.